నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | సోమవారం 9 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని వారికి సూచించారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో వైభవంగా ఆరట్టు

ఆరట్టు ఉత్సవంలో అయ్యప్ప భక్తులు

దండేపల్లి, డిసెంబర్ 8 : గూడెం అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి ఆరట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, ఆలయం సందడిగా మారింది. 'స్వామియే శరణమయ్యప్పా..' నామస్మరణలో ఆ ప్రాంతం మారుమోగింది. ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అయ్యప్ప మాలధారణ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి, ఆలయ వ్యవస్థాపకుడు చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెన్నూర్ ఎత్తిపోతలపై పట్టింపేది?

కాంగ్రెస్ సర్కారులో కనిపించని పురోగతి

చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ (ఫైల్)

- లక్ష ఎకరాలకు సాగు నీరు, మూడు మున్సిపాలిటీలు, 103 గ్రామాలకు తాగు నీరిచ్చే ప్రాజెక్టుపై నిర్లక్ష్యం
- పక్కనున్న మంథని నియోజకవర్గంలో చేపట్టబోయే చిన్న కాళేశ్వరానికి మాత్రం వెంటనే నిధులు
- ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్న చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు ● పంథాలకు పోయి నష్టం చేయొద్దని విజ్ఞప్తి
- నోరు మెదపని ఎమ్మెల్యే గడ్డం వివేక్ ● స్వార్థ ప్రయోజనాలే తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోడన్న ఆరోపణలు

చెన్నూర్, డిసెంబర్ 8 : కేసీఆర్ సర్కారులో మంజూరైన చెన్నూర్ ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగు నీరు, మూడు మున్సిపాలిటీలు, 103 గ్రామాలకు తాగు నీరందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును పక్కనపెట్టి.. మంథని నియోజకవర్గంలో చేపట్టబోయే చిన్న కాళేశ్వరానికి మాత్రం వెంటనే నిధులు మంజూరు చేయడం వెనుక ఆంతర్యమేమిటన్న ప్రశ్న తలెత్తుతున్నది. ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలు చూడాలి తప్ప.. ఇలా పార్టీల వారీగా పంథాలకు పోయి నష్టం చేయడం ఏమాత్రం సమంజసం కాదని ఆయా వర్గాల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాగా, ఈ విషయమై ఎమ్మెల్యే గడ్డం వివేక్ నోరుమెదపకపోగా, అనేక విమర్శలకు తావిస్తున్నది.

బాల్క సుమన్ ప్రత్యేక చొరవతో..

కేసీఆర్ సర్కారులో ఎమ్మెల్యేగా ఎన్నికైన బాల్క సుమన్ ఎత్తిపోతల పథకాలపై ప్రత్యేక చొరవ చూపారు. చెన్నూర్ నియోజకవర్గ భౌగోళిక స్వరూపంపై పూర్తి అవగాహన ఉన్న ఆయన ప్రాణహిత నదిపై ఒకటి, గోదావరి నదిపై రెండు ఎత్తిపోతల పథకాలను నిర్మించి లక్షకు పైగా ఎకరాలకు సాగు నీరు, మూడు మున్సిపాలిటీలకు, 103 గ్రామాలకు తాగు నీరందించాలన్న ఆలోచనకు వచ్చారు. ఇందుకు అనుభవజ్ఞులైన ఇంజినీర్లతో చర్చించి తన ఆలోచనను అప్పటి సీఎం కేసీఆర్‌కు తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు, ప్రజలకు ఉపయోగపడే ఈ భారీ ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన వెంటనే స్పందించి సర్వే కోసం రూ 8.88 కోట్ల నిధులు మంజూరు చేయించారు. 2020 జూన్ ఒకటిన సర్వే పనులను ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రారంభించారు. నిర్దేశించిన గడువు లోగా సర్వే పనులు పూర్తి చేసిన ఇంజినీరింగ్ అధికారులు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును ప్రభుత్వానికి అందజేశారు. అయితే, హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో 2022 ఏప్రిల్12న సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర మంత్రి మండలి రూ 1,658 కోట్లు మంజూరు చేస్తూ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా 2023 జూన్ 9న మంచిర్యాలకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ చెన్నూర్ ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టి.. మంథని నియోజకవర్గానికి ప్రయోజనం చేకూరే చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకానికి)పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. రూ 571.57 కోట్లు మంజూరు చేసింది. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే, పరిశ్రమలశాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు జలసౌధలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సమీక్ష నిర్వహించి ప్రభుత్వ పరిపాలనా ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు.

పట్టించుకోని ఎమ్మెల్యే వివేక్

తన నియోజకవర్గ ప్రజల కోసం మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు చేపడుతుంటే.. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మాత్రం చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టినా నోరుమెదపడం లేదు. వివేక్ తన స్వార్థ ప్రయోజనాలే తప్ప.. ఈ ప్రాంత ప్రజల బాగోగులను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి మంత్రి పదవి కోసం పాకులాడుతున్నారే తప్ప.. నియోజకవర్గ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా తన స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి చెన్నూర్ ఎత్తిపోతల పథకంపై శ్రద్ధ పెట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చెన్నూర్ ఎత్తిపోతలతో ఎంతో మేలు

చెన్నూర్ ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే ఈ నియోజకవర్గానికి ఎంతో మేలు జరిగేది. 10 టీఎంసీల గోదావరి నీటిని వాడుకొని నియోజకవర్గంలోని చెరువులను నింపాలనుకున్నారు. చెరువుల నుంచి గ్రావిటీ కాలువల ద్వారా దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరందించాలనుకున్నారు. అలాగే నియోజకవర్గంలోని చెన్నూర్, మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలతో పాటుగా చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లోని 103 గ్రామాలకు తాగు నీరు అందించాలని అభిప్రాయపడ్డారు. కానీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో ఎత్తిపోతల పథకం గురించి పట్టించుకోవడం లేదు.

చెన్నూర్ ఎత్తిపోతల పథకం స్వరూపం

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో కోటి కిపైగా ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. గోదావరి నదిపై మేడిగడ్డ వద్ద (లక్ష్మి) బ్యారేజ్, అన్నారం వద్ద (సరస్వతీ) బ్యారేజ్, సుందిళ్ల వద్ద (పార్వతి) బ్యారేజ్‌లను నిర్మించారు. దీంతో నియోజకవర్గం చుట్టూ ఉన్న గోదావరి, ప్రాణహిత నదులు నిండుకుండలా ఉంటున్నాయి. అయితే, ఈ మూడు బ్యారేజ్‌లపై మూడు భారీ ఎత్తి పోతల పథకాలు నిర్మించి, 10 టీఎంసీల గోదావరి నీటిని వినియోగించి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు, మూడు మున్సిపాలిటీలకు, 103 గ్రామాలకు తాగు నీరు అందించాలనుకున్నారు.



చెన్నూర్ ఎత్తి పోతల పథకం మ్యాపు

ఆల్గాం ఎత్తి పోతలతో..

మేడి గడ్డ (లక్ష్మి) బ్యారేజ్‌పై కోటపల్లి మండలం ఆల్గాం గ్రామం వద్ద ప్రాణహిత నదిపై ఎత్తి పోతల పథకాన్ని నిర్మించాలనుకున్నారు. దీని ద్వార మేడి గడ్డ (లక్ష్మి) బ్యారేజ్ బ్యాక్ వాటర్ నుంచి 16 కిలో మీటర్ల మేర పైపు లైన్ ఏర్పాటు చేసి 30 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తి పోసి శంకరాపూర్ చెరువును నింపాలని, ఇక్కడి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా 23 చెరువులను నింపాలని నిశ్చయించారు. ఈ చెరువుల నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా కోటపల్లి మండలంలోని 16,370 ఎకరాలకు సాగు నీరు అందించాలనుకున్నారు.

నర్సక్కపేట ఎత్తిపోతలతో..

అన్నారం (సరస్వతీ) బ్యారేజ్‌పై చెన్నూర్ మండలం నర్సక్కపేట గ్రామం వద్ద గోదావరి నదిపై ఎత్తి పోతల పథకాన్ని నిర్మించాలని కేసీఆర్ సర్కారు నిర్ణయించింది. దీని ద్వారా అన్నారం (సరస్వతీ) బ్యారేజ్ బ్యాక్ వాటర్ నుంచి 16 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసి 50 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తి పోసి.. భీమారం మండలంలోని మద్దికల్ చెరువును నింపాలని భావించారు. ఈ చెరువు ద్వారా గ్రావిటీ కెనాల్ ద్వారా చెన్నూర్ మండలంలోని 18 చెరువులు, కోటపల్లి మండలంలోని 9 చెరువులు, భీమారం మండలంలోని 11 చెరువులను నింపాలనుకున్నారు. ఈ చెరువుల నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా చెన్నూర్, భీమారం, కోటపల్లి మండలాల్లోని 48,208 ఎకరాలకు సాగు నీటిని అందించనున్నారు.

టేకుమట్ల ఎత్తిపోతలతో..

సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్‌పై జైపూర్ మండలం టేకుమట్ల గ్రామం వద్ద గోదావరి నదిపై ఎత్తి పోతల పథకాన్ని నిర్మించేందుకు కేసీఆర్ సర్కారు సన్నద్ధమైంది. సుందిళ్ల బ్యాక్ వాటర్ నుంచి 17 కిలో మీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేసి 53 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తి పోసి మందమర్రి మండలం పొన్నారం చెరువును నింపాలని, అక్కడి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా మందమర్రి మండలంలోని 7 చెరువులను, జైపూర్ మండలంలోని 21 చెరువులను నింపాలని ప్రణాళికలు రూపొందించింది. ఈ చెరువుల నుంచి గ్రావీటి కెనాల్ ద్వారా జైపూర్, మందమర్రి మండలాల్లోని 25,423 ఎకరాలకు సాగు నీరందించాలని నిశ్చయించారు.

త్వరితగతిన పనులు ప్రారంభించాలి

చెన్నూర్ నియోజకవర్గ ప్రజల ప్రయోజనం కోసం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం త్వరితగతిన ప్రారంభించి పనులు త్వరగా పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలు చూడాలి తప్ప.. ఇలా పార్టీల వారీగా పంథాలకు పోయి నష్టం చేయొద్దన్న వారు వేడుకుంటున్నారు.

చెన్నూర్ ఎత్తిపోతల పథకం సర్వే పనులను ప్రారంభిస్తున్న అప్పటి ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ (ఫైల్)

జీసీసీ మేనేజర్ సస్పెన్షన్?

కాగజ్‌నగర్, డిసెంబర్ 8 : కాగజ్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జి జీసీసీ మేనేజర్ బొజ్జ నాయక్ సస్పెన్షన్ అయినట్లు తెలుస్తున్నది. జీసీసీకి చెందిన సరుకులు పక్కదారి పట్టించారన్న ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ జీసీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆయనను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించినట్లు తెలిసింది. ఆసిఫాబాద్ జీసీసీ మేనేజర్ బొజ్జ నాయక్‌కు కాగజ్‌నగర్ జీసీసీ ఇన్‌చార్జి మేనేజర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఆసిఫాబాద్ జీసీసీకి చెందిన సరుకులు పట్టణంలోని డాడానగర్‌లో ఓ వ్యక్తి ఇంట్లో దింపుతుండగా యువకులు గమనించి పోలీసులకు సమాచారమివ్వగా, పోలీసులు అక్కడికి చేరుకొని ఆ సరుకుల వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరుసటి రోజు పోలీసులు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం అందించగా, వారు ఆ వాహనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ సైతం పట్టుబడిన జీసీసీ సరుకులపై విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. విచారణ, పట్టుబడిన జీసీసీ సరుకుల వివరాలు వెల్లడించకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకుండానే ఆ వాహనాన్ని జిల్లా కేంద్రానికి తరలించడంతో ఇరు శాఖల అధికారులపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతి కొద్ది రోజుల క్రితం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ జీసీసీ కార్యాలయాలను, గోదాములను తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో అవినీతికి పాల్పడినట్లు తేలడంతో సదరు మేనేజర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారి చేసినట్లు తెలుస్తున్నది. ఈ విషయమై డీఎం రామానందంను వివరణ కోరగా.. సస్పెన్షన్ విషయం నా దృష్టికి రాలేదన్నారు.

భీమారం : నర్సింగాపూర్‌లో ధాన్యంలో నిలిచిన వర్షపు నీరును పారబోస్తున్న రైతు

దహెగాం: కల్లంలో తడిసిన ధాన్యం

జన్నారం మార్కెట్ యార్డులో వరదలో కొట్టుకుపోతున్న వడ్లు

'అకాల' నష్టం

- వర్షాలకు తడిసిన ధాన్యం, పత్తి
- అన్నదాతల్లో ఆందోళన

నెన్నెల : మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

నెన్నెల/వేమనపల్లి/భీమారం/దండేపల్లి(జన్నారం)/దహెగాం, డిసెంబర్ 8 : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతన్నలకు తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నాయి. నెన్నెల మండలంలో కల్లాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తడంతో అన్నదాతలు లబోదిబోమని మొత్తుకుంటున్నారు. వేమనపల్లి మండలం జిల్లెడ, బుయ్యారం, సూరారం తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ బురదమయమయ్యాయి. పలుచోట్ల వరిధాన్యం, చేలల్లోని పత్తి తడిసి ముద్దయ్యింది. అక్కడక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భీమారం మండలం నర్సింగాపూర్, భీమారం, దాంపూర్, ధర్మారం, రెడ్డిపల్లి, కొత్తపల్లి, మద్దికల్ గ్రామాల్లో అమ్మేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసింది. జన్నారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో తూకానికి ఉన్న ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు వేడకుంటున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలో శనివారం రాత్రి కురిసిన వానకు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోగా, కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలకొరిగింది. అనేక చోట్ల పత్తి తడిసి రంగు మారింది.

భీమారంలో కల్లంలో తడిచిన ధాన్యం

సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీఎఫ్ డోబ్రియల్

పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

పీసీసీఎఫ్ డోబ్రియల్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 8 : జిల్లాలో పులుల సంచారం పెరిగిన నేపథ్యంలో వాటి సంరక్షణకు, ఆవాసానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ డోబ్రియల్ పేర్కొన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్, సీసీఎఫ్ రామలింగంతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ అభయారణ్యాల నుంచి పులుల రాక పెరిగిందని, ప్రస్తుతం ఆవాసం కోసం వెతుకుతున్నాయని తెలిపారు. పులి ఆవాస కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రానున్న రోజుల్లో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎకో టూరిజం అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పులి, ఏనుగు దాడుల్లో పలువురు చనిపోవడం బాధాకరమన్నారు. అటవీ సిబ్బందికి ఆయుధాలివ్వడంపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించినట్లు తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న భూముల సర్వేపై అడుగగా, సర్వే చేయాల్సిన అవసరం లేదన్నారు. పులులపై వదంతులు ప్రచారం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహూ, ఎఫ్ఆర్వోలు గోవింద్ సింగ్ సర్ధార్, సరోజా రాణి, జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి రూపం మార్చడమెందుకో?

- ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే తగిన గుణపాఠం తప్పదు ● మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- నస్పూర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన



నస్పూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 8 : కాంగ్రెస్ సర్కారు తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చి ఈ ప్రాంత ప్రజలను అవమానపరుస్తున్నదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదివారం నస్పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో పాటు పలువురు నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తన ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని, ఈ క్రమంలో రాష్ట్రమంతటా తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ విగ్రహ రూపాన్ని మార్చడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయంపై యావత్ తెలంగాణ ప్రజానీకం మండిపడుతున్నదన్నారు. అభివృద్ధి సంక్షేమం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన ప్రభుత్వం అక్రమ అరెస్టులు, కేసులు ఇలా అనేక రకాల కుట్రలు, కుతంత్రాలు, నిర్బంధాలతో పాలన సాగిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, కుర్మిళ్ల అన్నపూర్ణ, నాయకులు బండి రమేశ్, మల్లెత్తుల రాజేంద్ర పాణి, గుంట జగ్గయ్య, గుమ్మడి శ్రీను, రఫీక్ ఖాన్, బండారి తిరుపతి, ఆకునూరి సంపత్‌కుమార్, గర్మె భీమయ్య, ఆకుల సతీశ్, అండ్ల కొండ రవిగౌడ్, మాడుగుల స్వామిదాస్, పెరుమాళ్ల జనార్దన్, ధర్ని శంకర్, కొయ్యల రమేశ్, కాటం రాజు, సాజిద్, తిరుమల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.